క్లుప్తంగా

ఎమ్మెల్యే కాసు నామినేషన్‌కి తరలిరండి

దాచేపల్లి : గురజాల అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలి రావాలని పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కోట కృష్ణ, షేక్ సుభానీ మంగళవారం తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి ఎమ్మెల్యే కాసు నామినేషన్ వేస్తున్న గురజాల ఆర్డీవో కార్యాలయం వరకు వెళ్లాలని, నగర పంచాయతీతో పాటుగా అన్ని గ్రామాల నుంచి భారీగా తరలిరావాలని కోరారు.

13 మంది వలంటీర్లు రాజీనామా



పిడుగురాళ్ల రూరల్ : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తిరిగి అధికారం సాధించేందుకు మేమంతా సిద్ధమంటూ వలంటీర్లు రాజీనామాలు చేశారు. మండలంలోని కామేపల్లి గ్రామ సచివాలయంలో 13 మంది వా/లంటీర్లు రాజీనామా చేసి పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వరరావుకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ప్రతి ఇంటికీ అందించిన సంక్షేమ పథకాలను చెప్పి వారి ద్వారా ఓటు వేయించి సీఎం జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ అధికారం చేపట్టేలా కృషి చేస్తామని వారన్నారు.

టీడీపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు

–ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవి



మాచర్ల : రాష్ట్రంలో మహిళలకు మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి పిన్నెల్లి రమాదేవి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం 19 వార్డు కౌన్సిలర్ బత్తుల వేణు, ఆప్రాంత వైఎస్సార్‌సీపీ నేతలు మాచర్ల పవన్, మాచర్ల సుందరరావు, మున్సిపల్ చైర్మన్ చిన్న ఏసులతో ఆమె ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దన్నారు. ప్రచారంలో సుమారు 200 మంది మహిళలు, మహిళ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

మండల టాపర్‌గా రాళ్ళపల్లి మహేశ్వరి



దుర్గి : ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాళ్ళపల్లి మహేశ్వరి 579 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానంలో నిలిచింది. బి చంద్రశేఖర్‌రెడ్డి 578 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాడు. స్థానిక సాయితేజ స్కూల్‌లో మహేశ్వరి, దుర్గి జెడ్పిహెచ్ఎస్‌లో బి చంద్రశేఖర్‌రెడ్డిలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. దుర్గి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 123కి 96 మంది, కెజిబివిలో 33కి 18, ఎపి మోడల్ స్కూల్‌లో 87కి 77 పాసయ్యారు. ముటుకూరు 57కి 30, అడిగొప్పల 64కి 40, ఓబులేశునిపల్లె 78కి 47, దుర్గి ఎపి మోడల్ స్కూల్ 88.51 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మండల టాపర్‌గా నిలిచిన రాళ్ళపల్లి మహేశ్వరి, కంచరగుంట గ్రామానికి చెందిన రైతు కుటుంబానికి చెందిన విద్యార్థిని. భవిష్యత్తులో డాక్టర్ విద్యనభ్యసించాలని తన కోరికగా చెప్పింది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

జగనన్న ఆశయ సాధనకు కృషి చేస్తాం



దుర్గి : ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు సేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన వలంటరీ వ్యవస్థను రాజకీయ కక్షతో టీడీపీ నేత చంద్రబాబు తెరచాటు రాజకీయాలు నడిపి తమను ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని దూరం చేసినందుకు నిరసనగా వలంటీర్లు రాజీనామా చేశారు. మంగళవారం మండలంలోని కోలగుట్ల గ్రామ సచివాలయానికి చెందిన 9 మంది ఎంపీడీఓ జీఎల్ఎన్ గుప్తాకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్ ప్రజలకు అందించిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించి ప్రభుత్వ విప్ పిఆర్కే విజయానికి కృషి చేస్తామన్నారు. రాజీనామా సమర్పించిన వారిలో నలబోలు మంగారావు, ఎం శివ, ఎం శ్రీనివాస్,రెడ్డి, డి అశోక్, బర్మానాయక్, మౌనిక, అనంతలక్ష్మి, పి రవీంద్రబాబు తదితరులున్నారు.

ఇక్కడ వంద శాతం ఉత్తీర్ణత

- పిడుగురాళ్ల షెడ్యూల్ ట్రైబల్ స్కూల్‌లో అందరూ పాస్
- 10వ తరగతిలో విద్యార్థులంతా ఉత్తీర్ణులే



పిడుగురాళ్ల రెసిడెన్షియల్ స్కూల్



పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణత అయిన బాలికలు



విద్యార్థిని బాణావతు వెన్నెల బాయికి స్వీట్లు తినిపిస్తున్న ప్రిన్సిపల్ వనజ

పిడుగురాళ్ల : ఆ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివిన విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యారు. 28 మంది 10వ తరగతి పరీక్షలు రాస్తే 28 మంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ షెడ్యూల్ ట్రైబల్ స్కూల్ ఉత్తమంగా నిలిచింది. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక ప్రకారం విద్యాబోధన చేయడంతోపాటు స్టడీ అవర్స్ నిర్వహించటం, వారం వారం పరీక్షలు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను ఎప్పటికప్పుడు వెలికి తీస్తూ ఉత్తమ విద్యను అందించడంతో పిడుగురాళ్ల పట్టణంలోని ప్రభుత్వ షెడ్యూల్ ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్‌లోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి నూటికి నూరుశాతం ఉత్తీర్ణులయ్యారు.

మొదటిసారి 100 శాతం ఉత్తీర్ణత : పట్టణంలోని షెడ్యూల్ ట్రైబల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మొట్టమొదటిసారిగా నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. 2021–22 విద్యా సంవత్సరంలో 22 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 20 మంది విద్యార్థులు పాస్ అయి 90 శాతం ఉత్తీర్ణతగా నమోదైంది. 2022–23 విద్యా సంవత్సరంలో 20 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాస్తే 18 మంది పాస్ కావడంతో 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. 2023–24 విద్యా సంవత్సరంలో 28 మంది 10వ తరగతి పరీక్షలు రాయడంతో మొత్తం 28 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి పల్నాడు ప్రాంతంలోనే వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ఘనత ఈ ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌కు దక్కిందని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో బొల్లాపల్లి మండలం చక్రాయపాలెం గ్రామానికి చెందిన బాణావతు వెన్నెలబాయి 549 మార్కులు సాధించి ఈ పాఠశాలలో ప్రథమ స్థానంలో, పి. శ్యామల 535 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఐదుగురు విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు.

శ్రమకు తగిన ఫలితం



మా ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థులంతా చక్కగా చదువుకుని నూరుశాతం ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలకే వన్నె తెచ్చారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో విద్యాబోధన అందించడంతోపాటు ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రతిభను తెలుసుకుని విద్యాబోధనలు అందించడంతో శ్రమకు తగిన ఫలితం సాధించగలిగాం. 5వ తరగతి ప్రవేశాలకు తమ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963752436 సంప్రదించాలని సూచించారు.

– సీహెచ్ వనజ, ప్రభుత్వ ఎస్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్, పిడుగురాళ్ల

జగనన్న సైనికుల్లా పని చేయాలి

గురజాల అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మహేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: కులాలు, పార్టీలు, మతాలకు అతీతంగా సంక్షేమం..అభివృద్ధి ప్రతి గడపకి అందించామని, కాలరు ఎగరేసుకుని ఓటు అడిగే హక్కు మనకి మాత్రమే ఉందని గురజాల అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక విజయభాస్కర కల్యాణ మండపంలో పార్టీ ముఖ్యనేతలు, రాజీనామా చేసిన వలంటీర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ ధైర్యంగా ప్రతి గడపకి వెళ్లి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి వైఎస్సార్‌సీపీకే ఓటువేయాలని అడగాలన్నారు. నియోజకవర్గంలో దాదాపుగా రూ. 4వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమాన్ని చేసి చూపించామని, పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఇప్పటికే వైఎస్సార్‌సీపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పార్టీ చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి నచ్చి కొత్తగా పార్టీలో చేరిన వారిని కూడా కలుపుకు వెళ్లాలని, పార్టీ విజయం కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఇచ్చి న్యాయం చేసే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే కాసు చెప్పారు. కుట్రలు, కుతంత్రాలు చేసి మోసపూరితమైన మాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టే పార్టీలతో యుద్ధం చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ జగనన్న సైనికుడిలా కదనరంగంలో కాలు మోపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, పట్టణ మాజీ కన్వీనర్ మునగా పున్నారావు, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభానీ, కోట కృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అభిమానం చూపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



కృతజ్ఞతలు తెలుపుతున్న పీఆర్కే

మాచర్ల: దివంగత మహానేత రాజశేఖరరెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు వెళుతున్న సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలో ఎవరికీ రాని విధంగా అభిమానం లభిస్తోందని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పల్నాడు జిల్లాలో సోమవారం నామినేషన్ దాఖలుకు వేలాదిగా తరలి రావడం అభినందనీయమని రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో నిర్వహించిన నామినేషన్ ర్యాలీకి తరలి వచ్చిన అభిమానులు,, కార్యకర్తలు, రైతులు, యువకులు, మహిళలు, అన్ని వర్గాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎండను సైతం లెక్క చేయకుండా 30వేల మందికి పైగా నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు, అన్ని వర్గాలను ఎన్నికల తరువాత జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రుణం తీర్చుకుంటామన్నారు.

నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బుధవారం గురజాల పట్టణంలోని ఆర్‌డీవో కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల పట్టణాలతో పాటు మాచవరం, పిడుగురాళ్ల, దాచేపల్లి గురజాల మండలాల్లోని 57 గ్రామాల నుంచి వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరై నామినేషన్ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండోసారి పోటీ చేయనున్నట్లు తెలిపారు. గురజాల నియోజక వర్గంలో శాశ్వత పథకాలతో పాటు అభివృద్ధిని చేపట్టటం జరిగిందని, రెండోసారి ఎమ్మెల్యేగా ప్రజలంతా ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పిద్దాం



మాచర్ల రూరల్ : మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 299 పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యతగా ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులంతా సమిష్టిగా పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్ కోరారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులకు, దివ్యాంగులకు ప్రభుత్వం కల్పించిన ఇంటి వద్దకే ఓటు వేసే ప్రక్రియకు అధికారులంతా యంత్రాంగాన్ని సిద్ధం చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు పోలింగ్ సిబ్బందికి తగు మార్గదర్శకాలు అందిస్తూ నిర్ణీత సమయంలో వారి దరఖాస్తులను తీసుకోవాలని కోరారు. ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతంగా, స్వతంత్రంగా వారి ఓటును వినియోగించుకునేలా అందరం పనిచేయాలన్నారు. గ్రామాల్లో పార్టీలు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేందుకు బొల్లా శ్రీనివాసరావు, కుందూరు వీరాంజనేయరెడ్డి నామినేషన్‌ను దాఖలు చేసినట్లు చెప్పారు.


ఘనంగా అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం



గురజాల : మండల పరిధిలోని తేలుకుట్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీరారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న యెనుముల, కేవీ : అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శిడిమాను ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు

ఎంఈఓ వేముల నాగయ్య



ఉప్పల నాగమల్లీశ్వరి | ఎస్‌కే ఉమర్ ఫారూక్ | టి.లావణ్య | మూఢావత్ బంగారి బాబునాయక్

రెంటచింతల : ప్రభుత్వం సోమవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండల పరిధిలో వివిధ పాఠశాలలకు చెందిన మొత్తం 727 మంది విద్యార్థులకు గాను 593 మంది ఉత్తీర్ణత సాధించడంతో 80.59 శాతం వచ్చినట్లు ఎంఈఓ వేముల నాగయ్య మంగళవారం తెలిపారు. రెంటచింతల ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల 86 శాతం, జెట్టిపాలెం ఏపి మోడల్ స్కూల్ 70 శాతం, తుమృకోట జిల్లా పరిషత్ స్కూల్ 59.45 శాతం, మిట్టగుడిపాడు కస్తూర్బా పాఠశాల 84 శాతం, రెంటాల జడ్పీ పాఠశాల 73.3 శాతం, పాలువాయి జడ్పీ పాఠశాల 55.5 శాతం ఎయిడెడ్ పాఠశాలలు లూథరన్ బాలికల హైస్కూల్ 68 శాతం, సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల 65 శాతం, వైఆర్ఎస్ స్కూల్ 68 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు నాగయ్య తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో రెంటాల జడ్పీ పాఠశాలకు చెందిన ఉప్పల నాగమల్లీశ్వరి 564 మార్కులు, టి.లావణ్య 537 మార్కులు, ఏపి మోడల్ స్కూల్‌కు చెందిన ఎస్‌కే ఉమర్ ఫారూక్ 540 మార్కులు, మహేష్ కుమార్ 533 మార్కులు, ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన మూఢావత్ బంగారి బాబునాయక్ 520 మార్కులు సాధించినట్లు ఎంఈఓ తెలిపారు.

మండల స్థాయిలో అనూరాధకు ప్రథమ స్థానం



విద్యార్థిని అనూరాధ

వెల్దుర్తి : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో శిరిగిరిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అనూరాధ 564 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. గుండ్లపాడు జెడ్పిహెచ్ విద్యార్థి జి అనూష 559 మార్కులు సాధించగా, జి త్రివేణి 557 మార్కులు సాధించారు. మండాది జెడ్పిహెచ్ఎస్ లో పి అభిషేక్ 466 మార్కులతో ప్రథమ స్థానం, వి అనూష 436 మార్కులతో ద్వితీయ స్థానం, వెల్దుర్తి జెడ్పిహెచ్ఎస్ డి మౌనిక 539 మార్కులతో ప్రథమ, రమ్య 536 మార్కులతో ద్వితీయ, శిరిగిరిపాడు జెడ్పిహెచ్ఎస్ సౌజన్య 540 మార్కులతో ద్వితీయ స్థానం, వెల్దుర్తి కెజిబిడి ఎ. ఝాన్సీ 466 మార్కులతో ప్రథమం, ఆర్ అనూరాధ బాయి 459 మార్కులతో ద్వితీయం, ఎపి మోడల్ స్కూల్, కండ్లకుంట ఎస్ గాయత్రి 562 మార్కులతో ప్రథమం, పి మోహన్ కుమార్ 537 మార్కులతో ద్వితీయం, ఐటిడిఎఎస్ యు కీర్తన 457 మార్కులు, జి భవాని 444 మార్కులు సాధించారు. వీరిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఉచిత మంచినీటి పథకం ప్రారంభం



మంచినీటి పథకం ప్రారంభిస్తున్న దృశ్యం

దాచేపల్లి : వేసవికాలంలో ప్రజల మంచినీటి దాహార్తిని తీర్చేందుకు నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ ముందుకు వచ్చారు. తన సొంత ఖర్చులతో సురక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేశారు. చైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయం వద్ద రూ.3లక్షల వ్యయంతో నిర్మించిన ఈ పథకాన్ని మంగళవారం చైర్‌పర్సన్ సుబ్బమ్మ, పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటిపోవటంతో మంచినీటికి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటిని ప్రజలకు ఉచితంగా అందించేందుకు ఈ ప్లాంట్‌ని ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రజలు ఉచితంగా మంచినీళ్ల తీసుకెళ్లవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల రవికుమార్, కొప్పుల కృష్ణ, కుందురు తిరుపతిరెడ్డి, అంబటి ఆంజనేయులు, పానాది వెంకటనారాయణ, బొమ్మిరెడ్డి నరసింహరావు, గాదె రామకృష్ణారెడ్డి, బత్తుల వెంకయ్య పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు ఎవరూ సహకరించవద్దు



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలు

కారెంపూడి : ప్రలోభాలకు ఆశపడి గొడవలకు పాల్పడవద్దని, అసాంఘిక శక్తులకు సహకరించవద్దని కారెంపూడి సీఐ చినమల్లయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాత్రి కేంద్ర భద్రతా బలగాలతో కలసి పోలీసులు మండలంలోని మిరియాల, లక్ష్మీపురం, చినగార్లపాడు, ఒప్పిచర్ల, వేపకంపల్లి, చింతపల్లి గ్రామాల్లో కవాతు చేసి ప్రధాన వీధుల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ రాజు, ఏఆర్ డిఎస్పీ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ చినమల్లయ్య, ఎస్ఐ రామాంజనేయులు ఆ గ్రామాల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

సభ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కాసు



సభా స్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి

గురజాల : నామినేషన్ ప్రక్రియలో భాగంగా బుధవారం జరిగే భారీ బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. నామినేషన్ వేయడానికి వెళ్లే మార్గాన్ని పరిశీలించి నాయకులకు దిశా నిర్దేశం చేశారు. సుమారుగ 40వేలకు పైగా ప్రజానీకం రానున్నట్లు అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె అన్నారావు, వార్డు కౌన్సిలర్‌లు పోలు వీరారెడ్డి, బండి రవి, మంచి అంజి, మాజీ ఎంపీపీ వి అమరారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 15 కుటుంబాలు చేరిక



వైఎస్సార్‌సీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో 15 కుటుంబాలు మంగళవారం చేరాయి. స్థానిక విజయభాస్కర కల్యాణ మండపంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో జనసేన నాయకుడు పాడి ఆంజనేయులు, నడికుడి 17 వార్డుకి చెందిన టీడీపీ నాయకులు తర్రి సాలయ్య, యడ్లూరి అబ్రహాం, వేల్పుల మోషే, వేల్పుల రాబర్టు, పత్రా సర్జన్, బొణిగే అశోక్, చాట్ల రాజుతో పాటు పలువురికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే కాసు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, పట్టణ మాజీ కన్వీనర్ మునగా పున్నారావు, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభానీ, కోట కృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, సొసైటి అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, కోఆప్షన్‌సభ్యుడు వేల్పుల ధర్మదేవ్, మందపాటి దుర్గారావు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

విజయపురిసౌత్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించి తమ సత్తాను చాటుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 78 మంది విద్యార్థులకు గాను 76 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో నీలం అజయ్‌కుమార్ 571, కాకర్ల జయశ్రీ 561, కారుమూరి క్రిస్టియానా రేవతి 558 మార్కులు సాధించారు. డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినీ వైశైలజ 557, బి కిరణ్ అలేఖ్య 551, కె ఇందుబాయ్ 551 మార్కులు సాధించారు. ఈ పాఠశాలలో 99 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 97 మంది ఉత్తీర్ణత సాధించారు. పీటీజీ పాఠశాలలో 53 మంది విద్యార్థులకు గాను 50 మంది ఉత్తీర్ణత సాధించగా రమావత్ రంగాస్వామి నాయక్ 521 మార్కులు సాధించాడు. పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను హెచ్‌ఎం కాంతారావు, ప్రిన్సిపాల్స్ మేరి మంజుల, ఏ జాన్సన్, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

తహసీల్దార్ ఎస్. రామ్మోహన్‌రావు



రెంటచింతల గ్రామంలోని ఎన్నికల బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎస్. రామ్మోహన్‌రావు

రెంటచింతల : మండలంలోని పలు గ్రామాల్లో సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తహసీల్దార్ ఎస్. రామ్మోహన్‌రావు అన్నారు. మంగళవారం రెంటచింతల, రెంటాల, పశర్లపాడు, జెట్టిపాలెం గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను, రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను ఆయన సెక్టార్ ఆఫీసర్లతో కలిసి పరిశీలించి మాట్లాడారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు గత ఎన్నికల సమయంలో ఎక్కడ పోలింగ్ బూత్‌ల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నాయో ఆ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. మండల పరిధిలో ఉన్న 11 గ్రామాల్లో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా, ఫ్లగ్‌లు పెట్టుకునే అవకాశం ఉందా..లేదా, సరిపడా వెలుతురు, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం లేకుండా మౌలిక వసతుల ఏర్పాటు, వృద్ధులకు ర్యాంప్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో అవసరమైతే పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లను కూడా ఏర్పాటు చేసేందుకు స్థానిక రెవిన్యూ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. తెలంగాణా నుంచి అక్రమంగా మద్యం, నగదు, విలువైన వస్తువులు సరఫరా నిలుపుదల చేసేలా సత్రశాల ఏపి జెన్‌కో నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ముఖద్వారం వద్ద అంతరాష్ట్ర చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ ఆఫీసర్లు పి. సుధాకర్, ఆర్‌డబ్ల్యూస్ ఆర్‌ఐ దాసరి కాంతారావు, వీఆర్వోలు, పోలింగ్ బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు అడిగొప్పలలో పీఆర్కే ఎన్నికల ప్రచారం

దుర్గి : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని అడిగొప్పల గ్రామంలో బుధవారం పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. సాయంత్రం 4గంటల నుంచి గడపగడపకు వెళ్ళి ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించనున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.